## బెస్ట్ ఉమన్ ఫుట్‌బాలర్‌గా సౌమ్య

అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) వార్షిక అవార్డుల్లో భాగంగా 'బెస్ట్ ఉమన్ ఫుట్‌బాలర్ ఆఫ్ ది ఇయర్'గా సౌమ్య నిలిచింది. భువనేశ్వర్‌లో మే 2న జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ఆమె అందుకుంది. సౌమ్య గుగులోతు తెలంగాణలోని నిజామాబాద్‌లో పుట్టింది. తెలంగాణ నుంచి ఈ అవార్డు అందుకున్న తొలి ప్లేయర్‌గా రికార్డు సృష్టించింది. 2021లో జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేసింది. ఇప్పటి వరకు 33 మ్యాచ్‌లు ఆడి 5 గోల్స్ చేసింది. పురుషుల్లో సుభాశిష్ బోస్ 'బెస్ట్ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్'గా అవార్డు అందుకున్నాడు. అదేవిధంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి ప్రతిష్ఠాత్మక 'ఫుట్‌బాల్ ప్రోత్సాహక అవార్డు' లభించింది.

# ఐఐటీ ది గ్రేట్

## ఫస్ట్ జనరేషన్ ఐఐటీలు

**బాగా క్రేజీ ఉన్న విద్య ఇంజినీరింగ్. అలాంటి ఇంజినీరింగ్‌కు ప్రఖ్యాతిగాంచినవి ఐఐటీలు. ఎంతోమంది గొప్ప ఇంజినీర్లు, ఆర్కిటెక్చర్లను ప్రపంచానికి అందిస్తున్నాయి. పరిశోధనలకు కార్ఖానాలుగా నిలుస్తున్నాయి. అందుకే వీటిలో సీటు సాధించాలనే తపన ప్రతి విద్యార్థికి ఉంటుంది. దాదాపు 15 లక్షల మంది పోటీపడితే చివరికి సుమారు 18 వేల మందికి మాత్రమే ఐఐటీల్లో సీటు లభిస్తుంది. ప్రస్తుతం దేశంలో 23 ఐఐటీలు ఉన్నాయి. వీటిని ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరిస్తారు. 1959-60లలో ప్రారంభించిన ఐఐటీలను మొదటి జనరేషన్‌గా, తర్వాత కాలంలో రెండో జనరేషన్‌గా, 2016లో ప్రారంభించినవి మూడో జనరేషన్‌గా పిలుస్తుంటారు. 23 ఐఐటీల గురించి సంక్షిప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కోసం....**

### ఐఐటీ ఖరగ్‌పూర్



- దేశంలో మొదటి ఐఐటీ ఇది. దీన్ని 1951లో ప్రారంభించారు. ఈ సంస్థ నినాదం 'Yogah Karmasu Kaushalam'. కోల్‌కతాకు 150 కి.మీ. దూరంలో దీన్ని నిర్మించారు. బ్రిటిష్‌వారు నిర్మించిన నిర్బంధ క్యాంపు (జైలు)లో ఈ కాలేజీని ప్రారంభించడం విశేషం. నాడు స్వాతంత్ర్య యోధులను నిర్బంధించిన ఈ ప్రాంతం నేడు ఒక మహావిద్యాలయంగా మారింది. మొదట 224 మంది విద్యార్థులు, 42 మంది అధ్యాపకులతో ఈ ఐఐటీని ప్రారంభించారు. స్విస్ ఆర్కిటెక్ట్ డా. వెర్నర్ ఎం మోజర్ దీనికి రూపకల్పన చేశారు. సుమారు 2100 ఎకరాల సువిశాల ఆవరణలో విద్యాలయం, వసతి గృహాలతో మినీ టౌన్‌షిప్‌గా విస్తరించింది. ప్రస్తుతం 770కి పైగా ఫ్యాకల్టీలు, సుమారు 16 వేల మందికి పైగా విద్యార్థులు, 940 మంది ఇతర స్టాఫ్ సిబ్బంది ఉన్నారు.
- ప్రస్తుతం ఈ సంస్థ డైరెక్టర్‌గా ప్రొ. అమిత్ పాత్ర (Officiating) వ్యవహరిస్తున్నారు.
- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఈ సంస్థలో మెటలర్జికల్ ఇంజినీరింగ్ చదివారు. అజిత్ జైన్, సురేష్ చంద్ర మిశ్రా, ఆనంద్ సేన్ వంటి ప్రముఖులు ఇక్కడ చదివారు.

### ఐఐటీ బాంబే

- ఐఐటీలో బాగా క్రేజీ కలిగిన ఐఐటీగా పేరుగాంచింది. దీన్ని 1958లో ప్రారంభించారు. విదేశాల సహకారంతో ప్రారంభించిన మొట్టమొదటి ఐఐటీ. యునెస్కో, సోవియట్ యూనియన్ ఈ సంస్థకు నిధులను అందించాయి. ఈ సంస్థ నినాదం 'జ్ఞానం, పరమం, ధ్యేయం' (Knowledge is the supreme goal).



- ఇంజినీరింగ్, పరిశోధనల్లో దీనికి ప్రపంచ స్థాయి గుర్తింపు ఉంది. భారత ప్రభుత్వం ద్వారా 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినియన్సీ' గుర్తింపు పొందిన సంస్థ. ఇక్కడ ఇంజినీరింగ్‌తో పాటు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాలు కూడా ఉన్నాయి. ముంబైలోని పొవాయి ప్రాంతంలో సుమారు 495 ఎకరాల్లో ఇది విస్తరించి ఉంది.
- మొత్తం 15 అకడమిక్ డిపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ప్రస్తుతం 680 మంది ఫ్యాకల్టీలు పని చేస్తున్నారు. అత్యున్నత ప్రమాణాలతో దిగ్గజ ఐఐటీగా ప్రసిద్ధిగాంచింది.
- 2025 వరల్డ్ క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో ఇండియాలో మొదటి స్థానం, ప్రపంచంలో 150వ స్థానంలో నిలిచింది.
- ప్రస్తుతం ఈ సంస్థకు డైరెక్టర్‌గా ప్రొ. శిరీష్ కేదార్ వ్యవహరిస్తున్నారు.

### ఐఐటీ ఢిల్లీ




- ఈ సంస్థను యూకే సహకారంతో 1961లో ప్రారంభించారు. యూకే గవర్నమెంట్, ఫెడరేషన్ ఆఫ్ బ్రిటిష్ ఇండస్ట్రీస్ ఇన్ లండన్ సహకారంతో ఇంజినీరింగ్ & టెక్నాలజీ సొసైటీని ప్రారంభించి ఐఐటీని నెలకొల్పారు. ఢిల్లీలో 325 ఎకరాల ప్రాంగణంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినియన్సీ కలిగిన సంస్థ ఇది. బీటెక్, ఎంటెక్, ఎంఎస్, ఎమ్మెస్సీ, ఎం డిజైన్, ఎంబీఏ తదితర కోర్సులను అందిస్తుంది. 2000లో టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేషన్ యూనిట్, 2012లో సోనిపట్ క్యాంపస్‌లను ఐఐటీడీ ప్రారంభించింది. ఎయిమ్స్ ఢిల్లీతో కలిసి జజ్జర్ క్యాంపస్‌లో బయోమెడికల్ రీసెర్చ్‌ను ప్రారంభించింది.
- ప్రస్తుతం ఈ సంస్థకు డైరెక్టర్‌గా ప్రొ. రంజన్ బెనర్జీ వ్యవహరిస్తున్నారు.
- సంస్థ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 56 వేల మంది ఇక్కడ గ్రాడ్యుయేషన్‌తో పాటు ఇతర కోర్సులను పూర్తిచేశారు. 6353 మంది పీహెచ్‌డీ, 18614 మంది బీటెక్ డిగ్రీ చదివారు.

### ఐఐటీ కాన్పూర్

- 'తమసోమా జ్యోతిర్గమయ' అనే నినాదంతో ఈ సంస్థను 1959లో కేంద్రం ప్రారంభించింది. యునైటెడ్ స్టేట్స్‌లోని తొమ్మిది పరిశోధనా విశ్వవిద్యాలయాల కన్సార్టియం సహాయంతో ఐఐటీ కాన్పూర్ ఇండో-అమెరికన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ప్రముఖ ఆర్థికవేత్త జాన్ కెన్నత్ గాల్‌బ్రీత్ మార్గదర్శకత్వంలో దేశంలో మొదటిసారి కంప్యూటర్ సైన్స్‌ను (1963లో) ప్రారంభించిన సంస్థ ఐఐటీ కాన్పూర్. 1055 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఈ ఐఐటీని నిర్మించారు. నోయిడాలో ఎక్స్‌టెన్షన్ సెంటర్‌ను 2012లో ఈ సంస్థ ప్రారంభించింది. ఇక్కడ జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు, అంతర్జాతీయ సంబంధాల కోసం కార్యాలయాన్ని నిర్మించింది. అంతేకాకుండా న్యూయార్క్‌లో అలుమినస్‌తో కార్యాలయాన్ని ప్రారంభించింది. ఐఐటీ కాన్పూర్ ఇంజినీరింగ్, సైన్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఇంటర్‌డిసిప్లినరీ, డిజైన్ కోర్సులను అందిస్తున్నది.
- 2022-23 అకడమిక్ ఇయర్‌లో సుమారు 4500 మందికి పైగా అండర్‌గ్రాడ్యుయేట్, 2000 మంది పీజీ, 2100 పీహెచ్‌డీ విద్యార్థులు ఉన్నారు.
- 555 మంది ఫ్యాకల్టీలు. 47 మంది విజిటింగ్ ఫ్యాకల్టీలు ఉన్నారు.
- ప్రస్తుతం ఈ సంస్థకు డైరెక్టర్‌గా ప్రొ. మణీంద్ర అగర్వాల్ వ్యవహరిస్తున్నారు.



### ఐఐటీ మద్రాస్

- జాతీయ ప్రాముఖ్యత కలిగిన విద్యాసంస్థల్లో మద్రాస్ ఐఐటీ ఒకటి. జర్మనీ సాంకేతిక సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన సంస్థ కావడం విశేషం. 1956లో ఈ సంస్థకు బీజం పడింది. దీనికి సంబంధించిన ఒప్పందం వెస్ట్ జర్మనీలోని బాన్ నగరంలో జరిగింది. 1959లో ఐఐటీ మద్రాస్‌ను కేంద్రం ప్రారంభించింది. సుమారుగా 591 మంది ఫ్యాకల్టీలు, 9,000 మంది విద్యార్థులతో 250 హెక్టార్ల విశాలమైన క్యాంపస్ మద్రాస్ ఐఐటీకి ఉంది. ఇంజినీరింగ్, ప్యూర్ సైన్సెస్‌తో పాటు పలు విభాగాలు ఉన్నాయి. ఈ ఏడాది ఎన్‌ఐఆర్‌ఎఫ్ ప్రకటించిన జాబితాలో మొదటి స్థానంలో మద్రాస్ ఐఐటీ నిలిచింది. గత నాలుగేండ్లుగా మొదటి స్థానంలో నిలవడం గమనార్హం.



- 16 అకడమిక్ డిపార్ట్‌మెంట్స్ కలిగి ఉంది. 146 పేటెంట్స్, 829 ప్రాజెక్టులను ఈ సంస్థ చేపడుతుంది.
- ప్రస్తుతం ఈ సంస్థకు డైరెక్టర్‌గా ప్రొ. వి. కామకోటి వ్యవహరిస్తున్నారు.
- ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎగ్జామ్‌ను ఐఐటీ మద్రాస్ నిర్వహించింది.

### ఐఐటీ గువాహటి

- ఐఐటీల్లో అత్యంత ఆహ్లాదకరమైన ఐఐటీగా పేరుగాంచింది. అసోంలో అత్యంత సుందరమైన ప్రదేశంలో నిర్మించిన ఐఐటీగా దీనికి పేరు. ఒకవైపు బ్రహ్మపుత్రా నది మరోవైపు కొండల మధ్య 285 హెక్టార్ల సువిశాల ప్రాంగణంలో దీన్ని నిర్మించారు.
- దీన్ని 1994లో ప్రారంభించగా 1995 నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ బీటెక్, బీ డిజైన్, ఎంఏ, ఎం డిజైన్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. 'నాలెడ్జ్ ఈజ్ పవర్' అనే నినాదంతో దీన్ని స్థాపించారు. ఈశాన్య, తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో శక్తిమంతమైన పరమ్ ఇషాన్ అనే సూపర్ కంప్యూటర్ నిర్వహణను ఐఐటీ గువాహటి



చేపడుతున్నది.
- ఎన్‌ఐఆర్‌ఎఫ్ 2023 ర్యాంకింగ్‌లో ఇంజినీరింగ్ విభాగంలో 7వ స్థానంలో నిలిచింది.
- ఈ సంస్థ డైరెక్టర్‌గా ప్రొ.దేవేంద్ర జలిహాల్ వ్యవరిస్తున్నారు.